ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
ఆదివారం 16 నవంబరు 2025

ఘనంగా సర్దార్ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మేరా యువ భారత్ వరంగల్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో పటేల్ చిత్రపటానికి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. నవ భారత నిర్మాణం కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తని కొనియాడారు. ప్రతీ ఒక్కరు ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో యువ భారత్ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేశ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవో గోపీరామ్, తహసీల్దార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ

బచ్చన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని నేడు చిన్నరామన్‌చర్ల గ్రామంలో ఆవిష్కరిస్తున్నట్లు కురుమ సంక్షేమ సంఘం ప్రతినిధులు శనివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతోపాటు పలు పార్టీల నేతలు, కురుమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని వెల్లడించారు.

కమీషన్ల కోసం కడియం కక్కుర్తి

- ఎస్టిమేషన్ రూ.470 కోట్ల నుంచి రూ.1100 కోట్లకు పెంపు
- ఎమ్మెల్యే తన బినామీ కాంట్రాక్టర్‌కు పనుల అప్పగింత
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

రఘునాథపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కమీషన్ల కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి కక్కుర్తి పడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉప్పుగల్లు రిజర్వాయర్‌కు సంబంధించిన మెయిన్ కెనాల్స్ పనులకు రూ.470 కోట్లు అవసరముండగా, కడియం కమీషన్ల కోసం రూ.1100 కోట్ల ఎస్టిమేషన్ వేయించారని ఆరోపించారు. ఆ కాంట్రాక్టు పనులను కూడా ఆయన బినామీకే అప్పగించాడని ఆరోపించారు. కమీషన్లకు కేరాఫ్‌గా నిలుస్తున్న కడియం.. నీతి, నిజాయితీగా వ్యవహరించే వ్యక్తినని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. దమ్ముంటే రెండేళ్లలో నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. సమావేశంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వై.కుమార్ గౌడ్, జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, నాయకులు గూడ కిరణ్ కుమార్, కొయ్యడ స్వామి, దుబ్బాక హరీశ్, ముప్పిడి సాంబ, ఉడుగుల భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ నిధుల గోల్‌మాల్



ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యాధికారుల మాయాజాలం

- దాదాపు రూ.30 కోట్ల నిధుల ఖర్చులో చేతివాటం
- 2021-2024 కాలంలో మంజూరైన నిధులు
- వైద్య పరికరాలు, వైద్య అవసరాలకు ఖర్చు చేసే నిధుల పక్కదారి
- స్టేషనరీ, సర్జికల్, సామగ్రి సివిల్ పనులు, మందుల కొనుగోళ్ల పేరిట స్వాహా
- అనుమతులు లేవు.. క్యాష్ బుక్ లేదు..
- అత్యవసరం సాకులతో నిధులు హాంఫట్
- అక్రమాలపై నిగ్గుతేల్చిన విచారణ కమిటీ..
- రంగంలోకి దిగిన విజిలెన్స్

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఉత్తర తెలంగాణలో పేదలకు పెద్ద దిక్కుగా పేర పొందిన వరంగల్ ఎంజీఎం అస్పత్రిలో ఆరోగ్యశ్రీ నిధు లు దారి తప్పాయి. వైద్య పరికరాలు, వైద్య అసవరా లకు వినియోగించాల్సిన ఆరోగ్యశ్రీ ఫండ్‌ని నిబంధనల ను అతిక్రమించి.. అత్యవసరం సాకుతో కోట్లు కొల్లకొట్టారు. క్యాష్‌బుక్ లేకుండా.. కలెక్టర్ల అనుమతి లేకున్నా.. దర్జాగా స్టేషనరీ, ఔషధాలు, సివిల్ పనుల పేరిట స్వాహా చేశారు. 2021-24 మధ్యకాలంలో ఎంజీ ఎంకు విడుదలైన నిధులను కొందరు వైద్యాధికారులు వాటాలు పెట్టి పంచుకున్నారు. ఎంజీఎంలో ఏళ్ల తర బడి తిష్టవేసిన కొందరు వైద్యాధికారుల నిర్వాకంతో ఆరోగ్యశ్రీ నిధులు దారి తప్పాయనే టాక్ వినబడు తోంది. ఇటీవల బదిలీపై వెళ్లిన వైద్య సిబ్బంది కొందరు ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లటంతో వెలుగులోకి వచ్చిన ఈ అక్రమాలపై ఇప్పటికే విచారణ కమిటీ నిధుల దుర్వినియోగాన్ని తేల్చింది. ఇక విజిలెన్స్ బృందం రంగంలోకి దిగటంతో ఆరోగ్యశ్రీ నిధుల మాయంలో ఎవరి పాత్ర ఎంత అనేది తేలాల్సి ఉంది.

అక్రమార్కుల కన్ను

ఎంజీఎం అస్పత్రిలో ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగం వైద్యశాఖలో కలకలం రేపుతోంది. ప్రభుత్వ అస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స అందిస్తే.. ఆ మొత్తాన్ని అస్పత్రికి ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా చెల్లిస్తుంది. ఉదాహరణకు ఏదైనా జబ్బుతో రోగి ప్రభుత్వ అస్పత్రిలో కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొందవచ్చు. ఆ చికిత్సకు రూ.లక్ష వరకు బిల్లు అయితే ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి ఆ మొత్తం ప్రభుత్వ అస్పత్రికి చేరుతుంది. ఈ రూ.లక్షలో ఆయా జబ్బులను బట్టి 25 శాతం నుంచి 30శాతం వరకు చికిత్స అందించిన వైద్యుడితో పాటు వారికి సహకరించిన వైద్య సిబ్బందికి చెల్లిస్తారు. మిగిలిన 70శాతం నుంచి 75శాతం నిధులు అస్పత్రి ఖజానాలో జమ అవుతుంది. ఎంజీఎంలో ప్రతి నెల వందల సంఖ్యలో ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్స అందిస్తున్నారు. వీటి ద్వారా వచ్చిన మొత్తాన్ని ఎంజీఎంలో పేదలకు వైద్యం అందించేందుకు కావాల్సిన వైద్య పరికరాలు, పేషెంట్‌లకు కావాల్సిన సౌకర్యాలకు వినియోగించాల్సి ఉంటుందని వైద్య నిపుణులు చెప్పుతున్నారు. ఎంజీఎంకు 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2022-23, 2023-2024 ఆర్థిక సంవత్సరంలో సుమారుగా రూ.29.30కోట్ల వరకు నిధులు ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చినట్లుగా సమాచారం. భారీ మొత్తంలో నిధులు వస్తుండటంతో కొందరు కక్కుర్తి వైద్యుల కన్నుపడింది. నిబంధనలను తొంగలో తొక్కి.. అత్యవసరమనే సాకుతో నకిలీ బిల్లులతో (మిగతా 7వ పేజీలో)

ప్రాజెక్టు విస్తరణపై అభిప్రాయ సేకరణ

- సింథటిక్ ఆర్గానిక్ కంపెనీకి అనుమతులు కోరిన సుస్త్రో సంస్థ
- కంపెనీ ఏర్పాటుపై విచారణ చేపట్టిన కలెక్టర్
- నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు రైతుల వినతి

వివరాలు: 8వ పేజీలో



మాట్లాడుతున్న కలెక్టర్

విద్యుత్ డిజిటల్ సేవల విస్తరణ



- 20 ఫీచర్లతో టీజీ ఎన్పీడీసీఎల్ యాప్
- కొత్త సర్వీసుల మంజూరు మరింత సులభతరం
- వాట్సాప్ చాట్ బాట్‌లో సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు
- వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ గౌతంరెడ్డి

రాంనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతను అందిపుచ్చుకొని విద్యుత్ వినియోగదారులకు వివిధ రకాల డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వరంగల్ సర్కిల్ ఎస్ఈ గౌతంరెడ్డి అన్నారు. 20 ఫీచర్లతో టీజీఎన్పీడీసీఎల్ యాప్‌ను తీసుకరావడం జరిగిందన్నారు. ఆండ్రాయిడ్, ఐఫోన్‌లలో ప్లేస్టోర్‌కు వెళ్లి టీజీ ఎన్పీడీసీఎల్ అని టైప్ చేసి డౌన్‌లోడ్ చేసుకుంటే 20 రకాల సేవలను పొంద వచ్చన్నారు. డిజిటల్ సేవల్లో భాగంగా కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరును మరింత సులభతరం చేయడం జరిగిందని, కొత్త సర్వీసుల మంజూరులో లోపాలు ఉంటే తిరస్కరించకుకుండా మరోక అవకాశం కల్పిస్తున్నామన్నారు. కొత్త సర్వీసు దరఖాస్తులో సర్వీసు రిలీజ్‌కు సంబంధించి ప్రతి ఒక్క (మిగతా 8వ పేజీలో)

ముందుకు సాగుదాం!

- ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపునకు కసరత్తు
- పెంపుపై పీఏసీఎస్, ఏఈవోలకు బాధ్యతలు
- లక్ష్యం చేరుకునేందుకు ప్రణాళికలు
- జిల్లాలో ఆయిల్ పామ్ 8,025 ఎకరాల్లో సాగు
- ఈ యేడాది 3,500 ఎకరాల టార్గెట్
- సాగుకు భారీగా సర్కారు రాయితీలు
- ప్రతీ మండలంలో పంట విక్రయ సెంటర్లు..

రఘునాథపల్లి మండలం కుర్చపల్లి నుంచి డీసీఎంలో తరలిస్తున్న ఆయిల్‌పామ్ గెలలు



బచ్చన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగు వైపు రైతులను మళ్లించాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో వంట నూనెల వినియోగం ఎక్కువ కావటంతో పెద్దఎత్తున ఖర్చు చేసి విదేశాల నుంచి పామాయిల్ గింజలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీన్ని అధిగమించేందుకు ఇక్కడే సాగును ప్రోత్సహిస్తే రైతులకు ఆదాయం పెరగడంతోపాటు, ప్రజలకు తక్కువ ధరలో నూనె అందుబాటులోకి తేవచ్చని యోచిస్తోంది. అందుకే ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపుపై అధికారులకు దిశానిర్దేశం చేస్తోంది. ఇందుకు సంబంధించి జిల్లాలో విస్తృత ప్రచారం కల్పించి, లక్ష్యాన్ని చేరుకునేలా రైతులను సన్నద్ధంగా చేసే బాధ్యతలను సహకార సంఘాలకు, వ్యవసాయ విస్తరణాధికారులకు, సంబంధిత శాఖ అధికారులకు అప్పగిస్తోంది. రైతులకు అందజేస్తున్న సబ్సిడీతోపాటు సమీపంలో ఆయిల్‌పామ్ తయారు ఫ్యాక్టరీ సమీపంలోని సిద్దిపేట జిల్లా నర్మెట వద్ద ఉండటంతో ఇబ్బందులు లేకుండా ఉంటుందనే ప్రచారం జిల్లాలో విస్తృతంగా చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం మొక్కల అందజేత నుంచి ఎరువులు, డ్రిప్ పరికరాలు, అంతర పంటల సాగుకు ప్రోత్సాహం అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, బీసీ రైతులకు 90శాతం, ఇతరులకు 80శాతం చొప్పున రాయితీ సదుపాయాలు కల్పిస్తోంది. నాలుగేళ్ల నుంచి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు కొనసాగుతోంది.



బచ్చన్నపేటలో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ (ఫైల్)

సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యం..

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 2,361 మంది రైతులు 8,025 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో సాగు జరగటం లేదని ప్రభుత్వం (మిగతా 8వ పేజీలో)

మండలం	రైతులు	విస్తీర్ణం (ఎకరాల్లో)
జనగామ	219	740
నర్మెట	117	377
బచ్చన్నపేట	297	1,033
తరిగొప్పుల	108	359
స్టేషన్ ఘన్‌పూర్	192	612
చిల్పూరు	93	399
రఘునాథపల్లి	320	1,132
లింగాలఘనపురం	236	852
పాలకుర్తి	292	946
జఫర్‌ఘడ్	187	541
దేవరుప్పుల	212	694
కొడకండ్ల	88	340

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం

చిలుపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస ఉత్సవాలను పురస్కరించుకుని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వార కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న హాజరై ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలతోపాటు, పూలమాలలను సమర్పించారు. పూజారులు రవిందర్ శర్మ, రంగాచార్యులు కల్యాణ తంతును జరిపించారు. భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, ధర్మకర్తలు రత్నాకర్‌రెడ్డి, గోలి రాజశేఖర్, గనగోని రమేష్, వెంకటేశ్వర్లు, పుల్యాల నారాయణ రెడ్డి తదితరులు పాల్గొనగా, మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన గంప భాగ్యలక్ష్మి -చంద్రుడు దంపతులు అన్నదానం చేశారు.



చిలుపూరు గుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కల్యాణం జరిపిస్తున్న పూజారులు

ఆరోగ్య ఉసిరి

- ఎన్నెన్నో ఔషధాల మేళవింపు
- కార్తీక మాసంలో ప్రత్యేక స్థానం



లింగాలఘణపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదిస్తున్న అనేక సంపదల్లో ఉసిరిది ప్రత్యేక స్థానం. మానవుడికి ఆరోగ్య ప్రదాయినిగా వెలుగొందుతూ పవిత్ర కార్తీక మాసంలో ప్రత్యేక స్థానాన్ని సాధించి అటు ఆధ్యాత్మికంగా ఇటు ఆరోగ్యపరంగా మానవాళికి ఉసిరి ఎంతగానో మేలు చేస్తుంది. హిందువుల పండుగలకు ప్రకృతి ప్రసాదించే సిరి సంపదలకు ప్రత్యేక బంధం ఉంది. అలాగే కార్తీక మాసానికి ఉసిరికి కూడా అలాంటి బంధమే పెనవేసుకుని ఉంది. పుష్కలమైన ఔషధ గుణాలను కలిగిన ఉసిరితో కార్తీకమాసంలో వేకువజామున్నే శిరస్నానం చేస్తారు. తీపి, పులుపు రుచుల సమ్మేళనం ఉసిరితో త్రిగుణ దోషాలను నివారించవచ్చని ఆయుర్వేద వైద్యశాస్త్రం పేర్కొంటుంది. కఫం, వాతం, పైత్యం, మేహమూల, పైత్యభ్రమలను ఉసిరి నయం చేస్తుంది. జీర్ణాశయానికి, గుండెకు మేలు చేయడం తోపాటుగా వయస్సును, తేజస్సును నిలుపుతూ నిగారింప చేస్తుంది. ఉసిరితో ఎన్నో లాభాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు ప్రకృతి ప్రసాదించిన సంపదలో ఉసిరికి ఆయుర్వేదం పెద్దపీట వేసింది. ఉసిరిలో చిన్నకాయలు, పెద్దకాయలు రెండు రకాలుగా లభిసున్నాయి. చిన్నవాటికంటే పెద్ద ఉసిరికాయలు శ్రేష్టమైనవి. పెద్ద ఉసిరి కాయల్లో ఔషధ గుణాలు మెండుగా (మిగతా 8వ పేజీలో)

మేడారంలో క్యూలైన్స్‌కు నూతన గ్రిల్స్

మేడారం గద్దెల ప్రాంగణం విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూలైన్స్ గ్రిల్స్ నమూనాను మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాజాతర వేళ కోట్లాది మంది భక్తులు వనదేవతలను దర్శించుకునేందుకు వస్తారని, క్యూలైన్లు సాఫీగా సాగేందుకు బ్రాస్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 200 ఏళ్లపాటు మన్నికగా ఉండేలా గ్రిల్స్‌ను పటిష్టంగా తయారు చేయిస్తున్నామన్నారు. ఈ గ్రిల్స్‌ను గద్దెల ప్రాంగణంలో సుమారు ఆరు మీటర్ల లోతులోకి దింపి నిలబడు తున్నట్లు చెప్పారు.

-ఆంధ్రజ్యోతి, హైదరాబాద్



గ్రిల్స్ నమూనాలను పరిశీలిస్తున్న మంత్రి సురేఖ



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీధర్‌రావు

నిధులు మంజూరు చేయాలని వినతి

చిలుపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ పల్లగుట్ట గ్రామస్థులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. శనివారం చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు నేతృత్వంలో గ్రామ నాయకులు హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో కడియంను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులను ప్రారంభించడంతో పాటు, మరో రూ.50 లక్షల నిధులను సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌ఛైర్మన్ చిర్ర నాగరాజు, దార రాజు, జీడి ఆనందం, డైరెక్టర్లు రత్నాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, గుర్రపు యాదగిరి, ఇసురం శ్రీనివాస్, జగన్, బుచ్చయ్య, యేసురత్నం, వెంకటయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలప కోత మిషన్ సీజ్

కన్నాయిగూడెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుర్రేవులలోని కార్పెంటర్ వర్క్‌షాపుపై ఫారెస్టు అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఏటూరునాగారం దక్షిణ విభాగం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అప్సరున్నీసా తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాయిగూడెం మండలంలోని గుర్రేవుల గ్రామంలో వీరాచారి అనే కార్పెంటర్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా టేకు కలప నిల్వలు చేసి కోత యంత్రంతో పనులు చేస్తున్నాడని అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అధికారులు వస్తున్నారనే సమాచారంతో కలపను కార్పెంటర్ వేరే ప్రాంతంలో డంప్ చేసినట్లు గుర్తించామన్నారు. అనుమతులు లేకుండా కలప కోత పనుల చేస్తున్న యంత్రాన్ని సీజ్ చేసి ఏటూరునాగారం ఫారెస్టు కార్యాలయానికి తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నా మన్నారు.

ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలి

ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

వెంకటాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. మండలంలోని నర్సాపూర్‌లో ఉన్న యుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను శనివారం ఆయన సందర్శించారు. ముందుగా ఆరోగ్యమందిర్‌లోని గదులు, మందులు, పలు రిజిష్టర్లను పరిశీలించి అత్యవసర చికిత్స మందులు సమకూర్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం విపరీతమైన చలి ఉన్నం దున ప్రజలు ఎక్కువ సమయంలో చలిలో గడపకూడదని, శరీరం వెచ్చగా ఉండే దుస్తులు ధరించేలా ఆరోగ్యసిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వెంకటాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు శారద, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు



కాళేశ్వరాలయంలోని ఉసిరి చెట్టు వద్ద దీపాలంకరణ చేస్తున్న భక్తులు

కాళేశ్వరాలయంలో కార్తీక పూజలు

మహదేవపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కార్తీక మాస శనివారం భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఉదయం 4 గంటల నుంచే భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. బిల్వ పత్రాలతో పూజలు చేసి అనంతరం తులసి చెట్టు వద్ద లక్ష దీపాలు అలంకరించారు. శుభానందదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చీరె, సారె సమర్పించారు. భక్తులకు పాలు పంపిణీ చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆదినారాయణ(ఫైల్)

మంగపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలం నర్సయిగూడెం గ్రామంలో అప్పుల బాధతో భరించలేక ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. మంగపేట రెండో ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సయిగూడెం గ్రామానికి చెందిన సుంచ ఆదినారాయణ(38)తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో సాగు చేసేవాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పంట భారీగా దెబ్బతింది. దీంతో పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పుల భారంతో కుంగిపోయిన ఆదినారాయణ శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. మృతుడి భార్య వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

విద్యార్థులతో కలిసి నిరసన



విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న చిరంజీవి

ప్రహరీ నిర్మించాలని పాఠశాల ఎదుట నిరసన

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కోరుతూ బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి విద్యార్థులతో కలిసి పాఠశాల ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. చిరంజీవి మాట్లాడుతూ పాఠశాల ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా ప్రహరీ నిర్మించకపోవడంతో రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తులు న్యూసెన్స్ చేస్తున్నారని ఆరోపించారు. పశువులు, మేకలు, పందులు పాఠశాల ఆవరణలోకి వస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు గిరిజన శాఖ అధికారులకు సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదన్నారు.

పీడీఎస్‌యూ నేతలపై కేసులు ఎత్తివేయాలి

వడ్డెపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్‌లపై హనుమకొండ స్మైలీ డీజీ పాఠశాల యాజమాన్యం మోపిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పీడీఎస్‌యూ నేతలు గుర్రం అజయ్, మర్రి మహేష్‌లను కులం పేరుతో దూషించిన స్మైలీ డీజీ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌వర్మపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అన్నారు. 50 ఏళ్ల చరిత్ర కలిగిన పీడీఎస్‌యూను సమాజంలో అప్రతిష్ఠపాలు చేసేందుకే స్మైలీ స్కూల్ యాజమాన్యం తమ నాయకులపై దౌర్జన్యం చేసి దాడికి పాల్పడిందన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, న్యూడెమోక్రసీ నేత గ్రేటర్ వరంగల్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ నేతలు సన్ని, విజయ్, అజయ్, రాజు, దుర్గాప్రసాద్, చరణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలి

దేవరుప్పుల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 24 గంటలు తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులను ఆపాలని ఆర్‌ఎంపీల జిల్లా అధ్యక్షుడు పసునూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆర్‌ఎంపీల మండల అధ్యక్షుడు మేకపోతుల వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఓ వేడుకల మందిరంలో జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ పేదలకు సేవ చేస్తున్న తమపై ఐఎంఏ దాడులు ఆపాలని, పేద ప్రజలకు అందుబాటులో ఉండే తమ వ్యవస్థను రూపుమార్చాలని చూడడం తగదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, మండల ఉపాధ్యక్షులు శ్రీను, సుధాకర్, ప్రభాకర్, శ్రీశైలం, వాసు, వెంకటయ్య, అశోక్, రాంచందర్, శ్రీహరి పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామీణ వైద్యులు

సందడిగా జిల్లాస్థాయి టెన్నికాయిట్ ఎంపిక పోటీలు

హాజరైన 150 మంది బాలబాలికలు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఐడీఎల్ పాఠశాలలో జిల్లా స్థాయి టెన్నికాయిట్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-17బాలబాలికల విభాగంలో ఏర్పాటు చేసిన ఎంపిక పోటీలను హనుమకొండ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కోశాధికారి అలువాల రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి 150 మంది బాలబాలికలు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 21న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల టెన్నికాయిట్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోకారపు శ్యాంకుమార్, ఉమ్మడి జిల్లా కోశాధికారి జహంర్, ఐడీఎల్ పాఠశాల యాజమాన్యం ఫిరోజుద్దిన్, సర్పరాజుద్దిన్, పీఈటీ పాషా, సీనియర్ టెన్నికాయిట్ క్రీడాకారులు పవన్, సాయి, కౌశిక్, అర్జున్, దేవేందర్, మధు, వివిధ జిల్లాలకు చెందిన టెన్నికాయిట్ అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో నిర్వాహకులు

బీసీ ధర్మ దీక్షల పోరాటంతో కేంద్రం దిగిరావాలి

● అఖిల పక్షంతో ఢిల్లీలో ప్రధానిపై ఒత్తిడి పెంచాలి ● బీసీ జేఏసీ వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

కేయూ క్యాంపస్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీల ధర్మదీక్షల పోరాటంతో కేంద్రం దిగిరావాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేవరకు ఉద్యమిస్తామని బీసీ జేఏసీ వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కేయూలో 6 రోజులుగా నిర్వహిస్తున్న బీసీల ధర్మపోరాట దీక్షల ముగింపునకు శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై ధర్మ యుద్ధం చేస్తామన్నారు. జూబ్లీహిల్స్ విజయంతో ఎన్నికలకు వెళితే కాంగ్రెస్‌ను బీసీలు నమ్మరని అన్నారు. సీఎం ఢిల్లీకి అఖిలపక్షంతో వెళ్లి ప్రధానిపై ఒత్తిడి పెంచాలని అన్నారు. పార్లమెంట్ వేదికగా బీసీల రిజర్వేషన్ల కోసం రాజకీయ కార్యాచరణ ప్రకటించాలని అన్నారు. బీసీలను నమ్మించి మోసం చేస్తే దోషులుగా నిలబడక తప్పదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌ను ముట్టడిస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీకి బీసీల గుణపాఠం తప్పదన్నారు. రానున్నరోజుల్లో బీసీ ఉద్యమాలు విస్తృతం చేస్తామన్నారు.

దీక్షలకు బీసీ విద్యార్థి సంఘాల జేఏసీ ఛైర్మన్ ఆరెగంట నాగరాజుగౌడ్ అధ్యక్షత వహించగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్, బీసీ జేఏసీ నేతలు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, సంగాని మల్లేశ్వర్, చిర్రారాజుగౌడ్, బోనగాని యాదగిరిగౌడ్, వరంగల్ శ్రీనివాస్, భీమగాని యాదగిరి, మాదం పద్మజాదేవి, తమ్మెల శోభారాణి, వేముమ మహేందర్, డ్యాగల శ్రీనివాస్, అజయ్ సింగ్, అన్వేశ్, రాజశేఖర్, కాగితపు నాగరాజు, అనిల్, సుమన్‌రాజ్,నితిన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



కేయూ బీసీ దీక్షల్లో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలి

కేయూ క్యాంపస్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18 నుంచి నిర్వహించనున్న డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని డెమొక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కేయూ పరిపాలన భవనంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి పరీక్షలను వాయిదా వేయాలని వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ మాట్లాడుతూ.. కేయూ డిగ్రీ కళాశాలలు ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల కోసం ఇటీవల బంద్‌కు పిలుపు నిచ్చాయని తెలిపారు.

దీంతో పూర్తి స్థాయి లో సిలబస్ పూర్తికాలేదన్నారు. పరీక్షల సిద్ధం అయ్యేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తుఫాన్ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. వర్సిటీ అధికారులు డిగ్రీ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శశిధర్, అబినయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'హలో మాల.. చలో ఢిల్లీ'కి తరలిరావాలి

మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి

హనుమకొండ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ రద్దు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు డిసెంబరు 12, 13 తేదీల్లో 'హలో మాల.. చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని పార్టీలకతీతంగా మాల కులసంఘం నాయకులు విజయవంతం చేయాలని మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పసుల రాంమూర్తి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పరిరక్షించుకో వడానికి వర్గీకరణ రద్దు కోసం రోస్టర్ విధానాన్ని రద్దు చేసి 20 శాతం రిజర్వేషన్లు పెం చాలని, పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టి మాల మహర్ అనుబంధ కులాల సర్వతో ముఖాభివృద్ధి కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. శాస్త్రీయమైన లెక్కలు లేకుండా చేసిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, రోస్టర్ జీవోనంబర్ 99, జీవోనంబర్ 29 రాజ్యాం గ వ్యతిరేకమని, పునఃసమీక్షించాలని ఢిల్లీలో నిరసన చేయనున్నట్లు తెలిపారు.

అలాగే దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టాన్ని పక డ్బందీగా అమలుచేయాలని కోరారు. భారత రాజ్యాంగాన్ని అన్ని ప్రాంతీయ భాషల్లో నాన్ డీటెయిల్డ్‌గా అందించాలని పేర్కొన్నారు. కరెన్సీ నోట్లపై భారత రత్న అంబేద్కర్ ఫొటో ము ద్రించి రాజ్యాంగ పీఠికను విద్యార్థులు ప్రేయర్లలో చదివించాలని అన్నారు. కార్యక్రమంలో ఉసిల్ల ఆంజనేయులు, బందెల రాజేష్, మన్నె శ్రీనివాస్, మన్నె నర్సింగ్, ఉసిల్ల మహేందర్, ఉసిల్ల శివప్రసాద్, మన్నె కుమారస్వామి, మన్నె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా కారు దగ్ధం

తాడ్వాయి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామ శివారులోని కన్నెపల్లి క్రీడా ప్రాంగణంలో అనుమానాస్పదంగా కారు దగ్ధమైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకొంది. స్థానికులు, కారు యజమాని నిమ్మల బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన బాలరాజుతో పాటు నలుగురు స్నేహితులు రెండు కార్లలో విందు భోజనానికి క్రీడా ప్రాంగణానికి వచ్చారు. అప్పటికే నార్లాపూర్ గ్రామానికి చెందిన బాలరాజు స్నేహితులు అనిల్‌రెడ్డి, సంజయ్ మద్యం సేవిస్తున్నారు. పక్కన వారి కారు ఉంది. అందరూ కలిసి విందు ఆరగించారు. ఈ క్రమంలో మరో వ్యక్తి తన బైక్‌పై సాయికృష్ణ అనే వ్యక్తి కోడి పుంజును తీసుకొని వచ్చాడు. అనంతరం అక్కడ నుంచి లక్ష్మీదేవిపేట వారు తమ కారులో వెళ్లగా నార్లాపూర్ స్నేహితులు, బైక్‌పై వచ్చిన వ్యక్తి కారు యజమాని బాలరాజు నలుగురు కలిసి మధ్యాహ్నం సమయంలో నార్లాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి కారులో వెళ్లిపోయారు.

అయితే బాలరాజు కారు, బైక్ అక్కడే ఉంచి వేరే పనుల నిమిత్తం వెళ్లి తిరిగి సాయంత్రం 7 గంటలకు కొత్తూరు చేరుకున్నారు. అదే సమయంలో కొత్తూరుకు చెందిన యువకుడు బాలరాజు కారు అగ్ని మంటల్లో కాలుతుందని యజమానికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న యజమాని తన కుటుంబ సభ్యులు, స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



దగ్ధమవుతున్న కారు

అడవిపై నిఘా



గూడూరు రేంజ్ పరిధిలోని అడవి

- సంపద పరిరక్షణకు ఇస్రో సరికొత్త విధానం
- ఎన్‌ఆర్‌ఎస్సీ ద్వారా పర్యవేక్షణ, పరిశీలన
- హెచ్చుదల.. తగ్గుదలపై వేగంగా నివేదిక
- అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా గుర్తింపు

గూడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అడవుల సంరక్షణలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇస్రో అందించింది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్సీ) ద్వారా అటవీ సంపదను అంతరిక్షం నుంచి అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా లెక్కించవచ్చు. ఎక్కడ ఎంత విస్తీర్ణంలో ఉంది. ఏ ప్రాంతంలో తగ్గుముఖం, నరికివేతకు గురవుతుందో గుర్తించవచ్చు. ఈ విషయాలను తెలుసుకునేందుకు సుమారు 9 నెలల సమయం పట్టేది. అందులోనూ అంచనా లెక్కలు మాత్రమే ఉండేవి. ప్రస్తుత విధానంతో 5 రోజుల్లో కచ్చితమైన సమాచారం అందుబాటులోకి వస్తుంది.

అడవులను కాపాడేందుకు అటవీశాఖ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అడవుల శాతం తగ్గుదల ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అడవులు సమృద్ధిగా పెరిగితేనే ప్రాణకోటికి ఉపయోగకరం. ఇప్పటి వరకు అటవీశాఖ అధికారులు ఉపగ్రహ చిత్రాలు, రిపోర్టులు తయారు చేయడానికి 9 నెలల కాలం పడుతుంది. వాటిని పొందాలంటే 4 నుంచి 5 నెలల సమయం పడుతుంది. కానీ ఎన్‌ఆర్‌ఎస్సీ విధానం ద్వారా కేవలం ఐదు రోజుల్లోనే నివేదిక వచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ విధానాన్ని త్వరలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలో అమలు చేయనున్నారు.



భీమునిపాదం వద్ద పిచ్చుకలు ఏర్పాటు చేసుకున్న గూళ్లు



గూడూరు అడవిలో సంచరిస్తున్న చుక్కల దుప్పులు

అడవుల పరిరక్షణకు నూతన విధానం

అడవుల శాతం తగ్గిపోతుండడంతో అడవుల రక్షణకు అటవీ శాఖ సరికొత్త కార్యక్రమాన్ని ఎన్‌ఆర్‌ఎస్సీ సహాయంతో చర్యలు చేపట్టింది. దీనివల్ల అడవుల విస్తీర్ణం తగ్గకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు తీసుకోవచ్చు.

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్సీ)

ఆక్రమణ నుంచి అడవులను రక్షించుకునేందుకు అటవీశాఖ ఎన్‌ఆర్‌ఎస్సీను రూపొందించింది. ఇది ఇస్రోలో ఒక భాగంగా ఉంది. నూతన సిస్టమ్‌ను ఎన్‌ఆర్‌ఎస్సీ కనిపెట్టింది. దీనితో అడవుల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నారు. ఒక హెక్టార్ విస్తీర్ణంలో గల అడవుల మార్పును కనుగొనే అవకాశాలు ఉన్నాయి. ఆప్టికల్ రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫికల్ ఇన్ఫార్మేషన్ సిస్టమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ఆటోమోషన్‌తో కలిసి పని చేస్తుంది. ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా సీసీఎఫ్ (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) భద్రాద్రి కొత్తగూడెం కింద ఉన్న ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో పరిశీలించారు.

అటవీ సంపదను తెలుసుకోవచ్చు..

అడవుల విస్తీరాన్ని అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా గుర్తించనున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి లాభం చేకూరనుంది. అటవీ ప్రాంతంలో జరిగిన పెరుగుదల, తరుగుదలను కనిపెట్టవచ్చు. ఎంత మొత్తంలో అటవీ నిర్మూలన జరిగిందనే విషయాలు స్పష్టంగా తెలియనున్నాయి. అడవి ధ్వంసం కాకుండా జంతు జాతికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టవచ్చు.

మహబూబాబాద్ జిల్లాలో ప్రస్తుతం 2,87,670 హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది. అటవీశాఖ పరిధిలో 7 రేంజ్‌ల 45.07, భద్రాద్రి కొత్తగూడెం-60, ఖమ్మం-13, సూర్యాపేట-03 శాతం అడవులు ఉన్నట్లు ఆ శాఖ రికార్డులు పేర్కొంటున్నాయి.



అడవులను కాపాడేందుకు సరికొత్త విధానం

వి.చంద్రశేఖర్, ఎఫ్‌డీవో గూడూరు

అడవులను కాపాడేందుకు నూతన విధానానికి శ్రీకారం చుట్టాం. అటవి శాఖ నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్సీ) పేరుతో సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇస్రో అందించిన సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్‌ఆర్‌ఎస్సీ పని చేస్తుం ది. దీని అనుసంధానంగా ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, అనావరణ్ వ్యవస్థలు పనిచేస్తాయి. దీని ద్వారా అటవీ సంపదను అంతరిక్షం నుంచే అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా సులభంగా లెక్కించవచ్చు. అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల వేట, కలప స్మగ్లింగ్, అడవి భూములు అన్యాక్రాంతం కాకుండా అటవీ శాఖ చర్యలు తీసుకుంటుంది.



ఆలయంలోని 18 మెట్ల వద్ద అభిషేక పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

స్వామికి ప్రత్యేక పూజలు

నర్సంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేటలోని అయ్యప్ప ధర్మశాస్త్ర దేవాలయంలో 25వ మండల పూజలో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, ఆలయ కమిటీ చైర్మన్ పైసా సురేశ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలోని 18 మెట్ల వద్ద మహా పడిపూజను దాతలతో గురుస్వామి సీహెచ్ వెంకటేశ్‌శర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ప్రతిష్ఠించి గర్భగుడి నుంచి 18 మెట్ల వరకు పల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృత అభిషేకం, జల, కలశ, పూలభిషేకం ఘనంగా నిర్వహించారు. మహాపడిపూజ సందర్భంగా మాలధారులు చేసిన స్వామి శరణుఘోష ఆలయంలో మార్మోగింది. పూజల అనంతరం మాలధారులు, పుష్పాభిషేకం, పడిపూజ దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్య క్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు చింతల కమలాకర్‌రెడ్డి, శ్రీరాంఈశ్వరయ్య, దొడ్డ రవీందర్, అనంతుల రాంనారాయణ, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాముల శంకరయ్య, పుల్లూరి స్వామి, భూపతి లక్ష్మీనారాయణ, ట్రస్టు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు దినేశ్‌మిశ్రా, భక్తులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లో శిక్షణ

హసన్‌పర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సంస్కృతి విహార్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో 13 రోజుల్లోనే సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బాస రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 నుంచి 26వ తేదీ వరకు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. వరంగల్, ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాలతో పాటు హనుమకొండ జిల్లాలోని కమలాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వేలేరు, ధర్మసాగర్ మండలాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు అర్హులని తెలిపారు. 19 నుంచి 45 ఏళ్లు ఉండి అర్హత కలిగిన అభ్యర్థులు స్వయంగా శిక్షణ తరగతులకు హాజరు కావాలని కోరారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతితో పాటు శిక్షణ అనంతరం యోగ్యతా సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 9704056522, 98493 07873 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



మీడియాతో మాట్లాడుతున్న మధుసూదనాచారి

మహాయాగంలో పాలుపంచుకోవాలి

శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

దామెర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థమై మండలంలో నిర్వహిస్తున్న వేణుదత్త సువర్ణలక్ష్మి దాంపత్య వ్రత మహాయాగాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ సిరికొండ మధుసుదనాచారి తెలిపారు. ఇందులో భాగంగా శనివారం జాతీయ రహదారి-163 దామెర బస్ స్టేజీ సమీపంలోని ఏకశిల పాఠశాల ఎదురుగా అమృత వాలీ వద్ద మహా యాగం నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దత్త అవధూత, భగవాన్ రామదూత స్వామి వారి ఆశీస్సులతో ఆదివారం ఉదయం 8 గంటలకు మహాయాగం ప్రారంభమవుతుందని తెలిపారు. మహాయాగంలో పాల్గొనే భక్తులకు భగవాన్ రామదూత స్వామి వారి అనుగ్రహ భాషణం ద్వారా ఆశీర్వచనం పొందవచ్చని పేర్కొన్నారు. యాగంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ప్రవేశ రుసుం లేదని, పూజా సామగ్రి కూడా ఉత్సవ వాటిక వద్ద ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో దామెర మాజీ సర్పంచ్ దామెరుప్పుల శంకర్, ఒగ్లాపూర్ గ్రామాభివృద్ధి చైర్మన్ కేతిపెల్లి శ్రీధర్‌రెడ్డి, తక్కళ్లపహాడ్ మాజీ సర్పంచ్ దాడి మల్లయ్య, గండు రామకృష్ణ, పుల్యాల రఘుపతిరెడ్డి, కిన్నెర రమేష్, యార లింగారెడ్డి, కిన్నెర రమేష్, చిరు తదితరులు పాల్గొన్నారు.

మహాయాగానికి భారీ బందోబస్తు : ఏసీపీ

దామెర బస్ స్టేజీ సమీపంలోని ఏకశిల పాఠశాల ఎదురుగా అమృత వాలీ వద్ద నిర్వహిస్తున్న మహాయాగంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు పరకాల ఏసీపీ జి.సతీష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మహాయాగం వద్ద ఏర్పాట్లను సతీష్‌బాబు పరిశీలించారు. మహాయాగంలో పాల్గొననున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట పరకాల రూరల్ సీఐ పి.రంజిత్‌రావు, దామెర ఎస్సై కొంక అశోక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

‘ఆరోగ్యశ్రీ’ నిధుల గోల్‌మాల్

(5వ పేజీ తరువాయి)

కోట్లాది రూపాయలను స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

రూ.29.30 కోట్ల నిధుల గోల్‌మాల్

ఎంజీఎంకు 2021-24 మధ్య కాలంలో సుమారు రూ.29.30కోట్ల వరకు నిధులు విడుదల అయ్యాయి. ఈ నిధులను పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కావాల్సిన యంత్రాలు, వైద్య పరికరాలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వ నిబంధనల్లో పేర్కొన్నారు. అలాగే మెరుగైన వైద్య సేవల కోసం కూడా ఈ నిధులను వాడుకోవచ్చు. అయితే గత ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రులకు స్టేషనరీలకు కూడా డబ్బులు విడుదల చేయలేదు. దీంతో ఎంజీఎం ఖాతాల్లో నిల్వ ఉన్న ఆరోగ్యశ్రీ నిధులపై అప్పటి వైద్యాధికారులు, సిబ్బంది కన్ను పడిందనే టాక్ ఉంది. దీంతో స్టేషనరీ కొనుగోలు చేసినట్లు రికార్డులు సృష్టించినట్లుగా సమాచారం. స్టేషనరీ షాపుల యాజమానులతో ఒప్పందం చేసుకుని, వారికి 20శాతం కమిషన్ ఇచ్చి, నకిలీ బిల్లులతో కోట్లాది రూపాయలకు కన్నం వేశారు. పేపర్లు, న్యాప్‌కిన్‌లు, జిరాక్స్‌లు తదితర వాటి పేరిట రూ.2కోట్లకు పైగా డ్రా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. బెడ్‌పై క్లాత్‌లు కూడా రూ.500కు కొనుగోలు చేసి. రూ.3వేలకు పైగా బిల్లులు సృష్టించారనే ప్రచారం జరుగుతోంది.

సివిల్ పనులకు కూడా సుమారు రూ.4కోట్ల వరకు ఖర్చు చేసినట్లుగా సమాచారం. తలుపులు, కిటికీలు, బాత్‌రూమ్‌లు తదితర మరమ్మతుల పేరుతో ఆరోగ్యశ్రీ నిధులను స్వాహా చేశారనే ప్రచారం ఉంది. కేంద్ర ఔషధ గిడ్డంగుల నుంచి ఎంజీఎం ఆస్పత్రికి కావాల్సిన మందులను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఒకవేళ బయట మందులు కొనుగోలు చేయాలంటే ఆస్పత్రి కమిటీ ఏయే మందులు కొనుగోలు చేయాలో సిఫార్సు చేస్తుంది. జిల్లా కలెక్టర్ అనుమతితో మందులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే ఎవరి అనుమతులు లేకుండా.. అత్యవసరం అనే సాకుతో కోట్లాది రూపాయల విలువైన మందులు కొనుగోలు చేసినట్లు ప్రైవేటు మెడికల్ ఏజెన్సీల నుంచి బిల్లులు తీసుకుని కొందరు వైద్యులు, సిబ్బంది భారీ అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇక అత్యవసరం పేరిట ఆక్సిజన్ కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉన్నాయని తెలిసింది. పేషెంట్ కేస్‌షీట్‌కు రూ.350 చెల్లించినట్లు నిధులు డ్రా చేసుకున్నట్లుగా సమాచారం. వాస్తవానికి ఈ పేషెంట్ కేస్ షీట్ మార్కెట్‌లో రూ.25కే లభిస్తుంది. 2021-24 మధ్యకాలంలో రూ.29.30కోట్ల వరకు నిధులు మంజూరైతే సుమారు రూ.18కోట్ల వరకు గతంలో విధులు నిర్వహించిన కొందరు వైద్యాధికారులు, సిబ్బంది స్వాహా చేసి ఉంటారనే ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా గత పదేళ్లుగా ఎంజీఎంలో తిష్టవేసిన ఓ అధికారి తీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సదరు అధికారి సహకారంతో గతంలో ఇక్కడ పని చేసిన ఓ సీనియర్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పాత్ర కీలకంగా ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ ముగ్గురు ఇతర రాష్ట్రాల్లో కూడా ఆస్తులు కూడబెట్టారనే చర్చ జరుగుతోంది. అక్రమంగా కొల్లగొట్టిన ఆరోగ్యశ్రీ డబ్బులతో ఫామ్‌హౌస్‌లు, విల్లాలతో సదరు అక్రమార్కులు ఎంజాయ్ చేస్తున్నారనే ప్రచారం వుంది.

అక్రమాలపై విచారణలు

ఎంజీఎంలో వరుసగా జరుగుతున్న సంఘటనలపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టి సారించారు. పదోన్నతిపై వెళ్లిన ఓ ప్రొఫెసర్ ఎంజీఎంలో ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగంపై వైద్యశాఖ మంత్రికి తీసుకువచ్చినట్లుగా సమాచారం. వెంటనే వైద్యశాఖ ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. మంత్రి ఆదేశాలతో గత ఫిబ్రవరి 7వ తేదీన నర్సంపేట, జనగామ వైద్యకళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ మోహన్‌దాస్, డాక్టర్ గోపాల్‌రావు, జగిత్యాల వైద్యకళాశాల ఏడీ డాక్టర్ బాలాజీలతో కూడిన విచారణ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందించింది. అత్యవసరం పేరుతో అధికారులు ఆరోగ్యశ్రీ నిధులను దుర్వినియోగం చేశారని, అనుమతులు, టెండర్లు లేకుండా పనులు చేపట్టారని నిర్ధారించారు. దీనిపై ప్రభుత్వం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, ఉస్మానియా మెడికల్ కాలేజీ మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్, ఎండోక్రైనాలజిస్టు ప్రొఫెసర్ డాక్టర్ బీ.నీలవేణిలతో కూడిన త్రీమెన్ కమిటీని నియమించగా, అక్టోబర్ 31న ఎంజీఎంలో విచారణ చేపట్టింది.

2021 నుంచి 2024 వరకు ఎంజీఎం సూపరింటెండెంట్‌లుగా పని చేసిన వారితో పాటు సెక్షన్ ఉద్యోగులను విచారించారు. క్యాష్‌బుక్‌లో పూర్తి వివరాలు లేకపోవడాన్ని గుర్తించారు. మందులు, సర్జికల్స్ సామాగ్రి, కంప్యూటర్లు, ఇతర కొనుగోళ్ల వివరాలను సేకరించారు. మొత్తంగా విచారణ పూర్తి చేసి త్రిసభ్య కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. విచారణ కమిటీ, త్రిసభ్య కమిటీలు వేర్వేరుగా ఇచ్చిన నివేదికల ఆధారంగా ప్రభుత్వం ఎంజీఎంలో ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టింది. మూడు రోజుల క్రితం ఎంజీఎంలో పలు కీలకమైన ఫైళ్లను విజిలెన్స్ అధికారుల బృందం స్వాధీనం చేసుకుంది. అలాగే ఎంజీఎంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన అధికారులను విచారించారు. విజిలెన్స్ రిపోర్టు ఆధారంగా అక్రమార్కులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఆటల్లో అదుర్స్.. పోటీల్లో పతకాలు

- పేదింటి పిల్లలు క్రీడల్లో మెరికలు
- రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీల్లో రాణిస్తున్న మైనార్టీ గురుకుల క్రీడా కుసుమాలు



వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వారంత గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే. చదువుపై ఉన్న ఆసక్తితో హనుమకొండ పెద్దమ్మగడ్డలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల (టీజీఎంఆర్ఎస్, జేసీ) బాలుర-1 విభాగంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యను అభ్యసిస్తున్నారు. జీవితంలో స్థిరపడడానికి చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపిస్తున్నారు. తమ పాఠశాలలోని పీఈటీ, పీడీల వద్ద కబడ్డీ, హాకీ, లాన్‌టెన్నిస్, టగ్ ఆఫ్ వార్, కరాటే, సాఫ్ట్‌బాల్‌తో పాటు ఇతర క్రీడల్లో తర్ఫీదు తీసుకుంటున్నారు. ఇటీవల హనుమకొండ జేఎన్ఎస్ వేదికగా ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు విభాగాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను కొల్లగొట్టి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. జిల్లా, రాష్ట్రస్థాయి ఆటల్లో పాల్గొని ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే క్రీడాకారులకు దీటుగా క్రీడల్లో విజయం సొంతం చేసుకుంటున్నారు. ఆటల్లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగి ఆటల్లో అదుర్స్ అనిపించుకుంటున్నారు పేదింటి క్రీడా కుసుమాలు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక క్రీడలో ప్రావీణ్యం సంపాదించాలంటేనే కష్టం. అలాంటిది హనుమకొండలోని మైనార్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఒక్కొక్కరు రెండు, మూడు క్రీడల్లో ప్రతిభ కనబర్చడం విశేషం. ప్రిన్సిపాల్ ఎం. అన్నపూర్ణ చొరవతో నిష్ణాతులైన పీఈటీ వెలుగాటి రాజిరెడ్డి, పీడీ అంబాల రవికుమార్ వద్ద శిక్షణ పొందుతున్నారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటుతూ మైనార్టీ గురుకులాలకు కీర్తి, ప్రతిష్ఠలు తీసుకువస్తున్నారు. గురువుల ఆకాంక్షల మేరకు క్రీడల్లో కఠోర సాధనతో రాష్ట్ర జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాటు పలు పతకాలు సాధించిన విద్యార్థుల మనోభావాలు 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకం.

రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించా..

-ఎస్కే. అక్బర్‌అలీ, ఇంటర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు



ఇటీవల హనుమకొండ నెహ్రూ స్టేడియం వేదికగా ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆడి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. మరిపెడ బంగ్లా సమీపంలోని మారుమూల గ్రామానికి చెందిన నేను హనుమకొండలోని మైనార్టీ గురుకులంలో ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. చదువుతో పాటు క్రీడల్లో రాణించి లక్ష్యాన్ని చేరుకుంటా.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగమే లక్ష్యం..


-కస్తూరి కార్తీక్, 8వ తరగతి కబడ్డీ క్రీడాకారుడు



చిన్నప్పటి నుంచి కబడ్డీ అంటే ఎంతో ఇష్టం. కబడ్డీలో ఇప్పటికే పలు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించా. పీడీ అంబాల రవికుమార్ సార్ వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నా. కబడ్డీలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

జాతీయస్థాయి స్వర్ణం సాధించా..


-టి. పునీత్, 5వ తరగతి ఉమ్మడి వరంగల్ జిల్లా



వరంగల్ జిల్లా వేదికగా ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో 12 సంవత్సరాల వెపెన్స్ కటాస్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించా. మూడేళ్లుగా కరాటే మాస్టర్ నాగ మహేష్ వద్ద శిక్షణ పొందుతున్నాను. ప్రస్తుతం మైనార్టీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతూ పాఠశాల పీఈటీ రాజిరెడ్డి సార్ వద్ద ఇతర క్రీడల్లోనూ శిక్షణ తీసుకుంటున్నా.

ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో హాకీ ఆడుతున్నా..

-ఆర్. సాయిచరణ్, ఇంటర్ హాకీ క్రీడాకారుడు



దివంగత మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తితో హాకీలో శిక్షణ పొందుతున్నా. 7వ తరగతి నుంచి ఇక్కడే మైనార్టీ గురుకులంలో విద్యనభ్యసిస్తున్నా. ప్రస్తుతం ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. హాకీ క్రీడను ప్రోత్సహించేలా ఆట మైదానాలు ఏర్పాటు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు చేపట్టాలి.



మానిపండు తెగులు సోకిన వరి

వరికి మానిపండు తెగులు

- ఆందోళన చెందుతున్న రైతులు
- విత్తనశుద్ధి చేయాలంటున్న అధికారులు

కాటారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాటుక తెగులుతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల పరిధిలో వరి పంటకు ఫాల్స్‌స్మట్ అని పిలువబడే తెగులు సోకడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. తెలుగులో కాటుక రోగం, మానిపండు తెగులుగా పిలువబడుతూ వరి పంట దిగుబడులపై ప్రభావం చూపుతుంది. వరి కంకులకు పసుపు పచ్చని, నల్లని పదార్థంతో కూడిన కాటుక లాంటి బాల్స్‌లాగా తెగులు కనిపిస్తుంది. పోతులవాయి, చింతకాని, కాటారం, గంగారం, జాదరావుపేట, దేవరాంపల్లి, రేగులగూడెం, గోపాల్‌పూర్, బూడిదపల్లి పరిధిలో వరి పంటలకు మానిపండు తెగులు సోకింది. ఈ తెగులు ఉత్పత్తి దిగుబడులపై ప్రభావం చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫాల్స్‌స్మట్ రావడానికి కారణాలు..

వరి పంటలో ఫాల్స్‌స్మట్ రావడానికి వివిధ కారణాలు ఉంటాయని ఏడీఏ శ్రీపాల్, ఏవో పూర్ణిమ తెలిపారు. వాతావరణంలో అధిక ఆర్ద్రత, తక్కువ ఉష్ణోగ్రత కలిగి ఉన్నప్పుడు తెగుళ్లు రావడానికి అవకాశముంటుందన్నారు. ఫంగస్, తెగుళ్లు అధిక నత్రజని (యూరియా)వాడిన పొలాల్లో వస్తుందన్నారు. ఈ తెగులు గాలి ద్వా రా ఒక పొలం నుంచి వేరొక పొలానికి వ్యాప్తి చెందుతుంది. పూత, గింజల దశలో ఇది వస్తుంది. మొదట ఆరెంజ్ రంగులో ఉండే స్పోర్స్ తర్వాత పచ్చని, నల్లని రంగులోకి మారుతాయి. ఈ తెగులు సోకడం వల్ల 30- 40 శాతం దిగుబడులు తక్కువగా రావడానికి ఆస్కారం ఉంది.

తెగులు నివారణ మార్గాలు

పంట పొలాలను శుభ్రంగా ఉంచుకోవాలి. విత్తనాలను తప్పని సరిగా ఫంగిసైడ్స్‌తో విత్తన శుద్ధి చేయాలి. ఈ తెగుళ్లను తట్టుకునే రకాలు, సర్టిఫైడ్ విత్తనాలనే వేసుకోవాలి. అధిక నత్రజని ఉండే యూరియా, అమ్మోని యా లాంటి ఎరువులను ఎక్కువగా వాడొద్దు. పంట మార్పిడి చేయాలి. ఫాల్స్‌స్మట్ సోకిన పొలాల నుంచి తీసిన విత్తనాలను అసలే వాడొద్దు. తెగులు సోకితే కార్బండిజమ్ మందు లేదా ప్రొపికొనాజోల్ 1 ఎం.ఎల్. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సర్టిఫైడ్ చేసిన సీడ్ మాత్రమే వేసుకోవాలని ఏవో పూర్ణిమ తెలిపారు.

మదనానందస్వామి ఆరాధనోత్సవాలు



బచ్చన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సిద్దులగుట్ట సమీపంలోని దత్తాత్రేయ ఆలయంలో బసవ కళ్యాణ్ పీఠాధీశ్వరులు శ్రీమదనానందస్వామి 25వ ఆరాధనోత్సవం ఘనంగా జరిగింది. పలు జిల్లాల్లో అనేక జీర్ణ దేవాలయాలను ఉద్ధరించిన మహోన్నతులని నిర్వాహకులు కొనియాడారు. శతరుద్రసేవా పరిషత్‌ను స్థాపించి సంస్థ ద్వారా పలు సమాజహిత కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. మూల విరాట్టుకు పూర్ణాభిషేకం నిర్వహించారు. ప్రతి యేడాది ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. జనగామ, సిద్దిపేట, యాదాద్రి -భువనగిరి, హైదరాబాద్ నుంచి వేలాది మంది భక్తులు హాజరయ్యారు.

ఘనంగా పవిత్రోత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని స్టేషన్‌ఘన్‌పూర్‌లోని తిరుమల నాథస్వామి దేవాలయంలో పవిత్రోత్సవాలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఉదయం వేదపండితులు కలకోట రంగాచారి, రామానుజాచారి, రఘునాథాచార్యులు, ఆర్.విష్ణువర్ధనాచార్యులు, వత్సవాది జీవనాచార్యులు, గోపాల కృష్ణమాచార్యులు నేతృత్వంలో ఆరాధన సేవా కాలం, విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ, విష్ణు సహస్ర నామ పారాయణం, మంత్ర హోమాలు వైభవంగా చేపట్టారు. సాయంత్రం పిల్లలకు మంచి విద్యా బుద్దులు రావాలని కాంక్షిస్తు లక్ష్మీ హయగ్రీవ పూజలు ఉంటాయి. అలాగే ఉత్సవాల కాగా ఉత్సవాల ముగింపు రోజు ఆదివారం తిరుమల నాథునికి 108 కలశాలతో నవ కలశ శత ఘటాభిషేకం, శాత్తుమురై వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ బాధ్యులు కలకోట రంగాచారి, యాద శ్రీనివాస్, సరాబు ఆంజనేయులు, వికాస తరంగిణి బాధ్యులు వి.తిరుమల శ్రీనివాస్, కొలిపాక సతీష్, సీహెచ్ భాస్కర్‌రెడ్డి, వాసం సుధాకర్, నరేందర్, మధు తెలిపారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు

ముందుకు సాగుదాం!

(5వ పేజీ తరువాయి)

భావించటంతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. సహకార సంఘాలు రైతులకు దగ్గరగా పనిచేస్తాయని, ఏఈవోలు నిత్యం రైతుల మధ్య ఉంటారని భావించి వారిని ఇందులో భాగస్వాములను చేశారు. ప్రతీ పీఏసీఎస్ 100 ఎకరాలు, ప్రతి వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో) 50 ఎకరాలు సాగు చేయించేలా రైతులను గుర్తించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 3500 ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 597 ఎకరాల్లో సాగవుతోంది. మిగతా టార్గెట్ పూర్తి చేసేందుకు ముందుకెళ్తున్నట్లు చెబుతున్నారు.

అవగాహన సమావేశాలకు సన్నద్ధం

ఏ పంట సాగు చేసిన ఖర్చు భారీగా పెరిగిపోయి నికర ఆదాయం తక్కువగా వస్తుందని, ఆయిల్ పామ్ సాగుతో అలాంటి ఇబ్బందులు ఉండవని ప్రచారం చేయాలని నిర్ణయించారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో నష్టాలు, కోతులు, అడవి పందులు బెడద ఉండదని రైతులకు అవగాహన కల్పించే పనిలో పడ్డారు. పంట దిగుబడులు అమ్ముకోవటానికి ఇబ్బందులు లేవనే ప్రచారంతో రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లాలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, నర్మెటలో కలెక్షన్ సెంటర్‌లు ప్రారంభించారు. త్వరలోనే ప్రతీ మండలంలో ఏర్పాటు చేసేందుకు కసరత్తు సర్కారు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం సాగు చేసిన మొక్కల నుంచి 63 మంది రైతులకు చెందిన 362 ఎకరాల్లో గెలలు కోతకు రాగా 715 టన్నుల దిగుబడి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ప్రతీనెల ఆదాయం వస్తూనే ఉంటుందన్నారు. మండలాల వారీగా ఇప్పటి వరకు సాగు విస్తీర్ణం వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లాలో 14 సహకార సంఘాలు

కోదండరామ్, జిల్లా సహకార శాఖ అధికారి



జిల్లాలో 14 సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. ప్రతీ పీఏసీఎస్ పరిధిలో వంద ఎకరాలకు సంబంధించిన రైతులను గుర్తించి జాబితాలు సిద్దం చేయాలని సీఈవోలను ఆదేశించడం జరిగింది. పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలతోపాటు, సొసైటీలకు వచ్చే రైతులకు అవగాహన కల్పించి ఆయిల్‌పామ్ సాగు వైపు మరల్చేలా చూడాలని తెలిపాం.

ఎకరాకి 115 టన్నుల వరకు దిగుబడి

శంకర్ జిల్లా ఆయిల్‌ఫెడ్ అధికారి



ఆయిల్‌పామ్ దిగుబడి ఎకరానికి 10 నుంచి 15 టన్నుల వరకు వస్తుంది. టన్నుకు రూ.19 నుంచి రూ.21వేల వరకు డిమాండ్ ఉంది. సబ్సిడీపై మొక్కలు, డ్రిప్పు ప్రభుత్వం తరుపున అందజేయడం జరుగుతుంది. ఎకరాకు 57 మొక్కలు అవసరం. ఎకరానికి ప్రోత్సాహకంగా రూ. 51వేలను నాలుగేళ్లపాటు అందుతుంది. సాగు లక్ష్యం చేరుకోవడంలో సహకార సంఘాలు, ఏఈవోలు, తమశాఖ అధికారులు కృషి చేయనున్నారు.



గ్రామంలో ర్యాలీ చేస్తున్న గ్రామస్థులు

క్లినిక్‌ను తెరవాలని నిరసన

కొడకండ్ల, నవంబరు, 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని మాతృశ్రీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో సీజ్ చేయడంపై గ్రామస్థులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండే క్లినిక్ తెరిపించాలని మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహంచారు. మారుమూల ప్రాంతమైన కొడకండ్లలో సరైన ప్రభుత్వ వైద్య సదుపాయాలు లేనందున పీహెచ్‌సీని తెరవాలని డాక్టర్ భారతి ద్వారా డీఎంహెచ్‌వోకు వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రాజెక్టు విస్తరణపై అభిప్రాయ సేకరణ

- అనుమతులు కోరిన సుస్త్రో సంస్థ
- కంపెనీ ఏర్పాటుపై విచారణ చేపట్టిన కలెక్టర్
- నష్టం జరగకుండా చూడాలని ఉప్పుగల్లు రైతుల వినతి

జఫర్‌గఢ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉప్పుగల్లులో సుస్ట్రో స్పెషాలిటీ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ విస్తరణ ప్రాజెక్టు నిర్వహణకు అనుమతులపై శనివారం కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఉప్పుగల్లు శివారులో ప్రస్తుతం కంపెనీ పత్తితో ఆయిల్ తయారీ ప్రాజెక్టు నిర్వహిస్తున్నారు. ఫ్యాక్టరీలో సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ విస్తరణ ప్రాజెక్టు కోసం ప్రభుత్వ అనుమతుల కోసం దరఖాస్తు చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో, ఇతర అధికారులతో కలిసి శనివారం కంపెనీ ఆవరణలో ఉప్పుగల్లు రైతులు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు.

రైతులు మాట్లాడుతూ ఆయిల్ కంపెనీ నిర్వహణతో దుమ్ము, ధూళి పంటలపై పడుతుండటంతో నష్టపోతున్నామని, నీటి కలుషితంతో జల కాలుష్యం ఏర్పడుతుందని నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ జోక్యం చేసుకొని అభ్యంతరాలపై పర్యావరణ, అటవీ, వాతావరణ, పరివర్తన నియంత్రణ మండలి అధికారులచే తనిఖీలు జరిపిస్తామని తెలిపారు. ప్రజలు, రైతులకు, పర్యావరణానికి ఎలాంటి నష్టం జరగకుండా చట్ట ప్రకారం నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. ప్రజాభిప్రాయాలను వీడియోరికార్డు చేయడం జరిగిందని, సంబంధిత శాఖల అధికారులకు తెలియపరచి, అనుమతులపై మరోసారి సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాగా గ్రామ ప్రతినిధులు మాట్లాడుతూ కంపెనీ ప్రతినిధులు ఉప్పుగల్లు గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధికి నిధులు వెచ్చించాలని, కంపెనీలో 50శాతం ఉద్యోగాలను ఉప్పుగల్లు వాసులకు కేటాయించాలని కోరారు. ప్రజలు, రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ బెన్‌షాలోమ్, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న నాయక్, తహసీల్దార్ రాజేష్‌రెడ్డి, ఎంపీడీవో సుమన్, కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ అధికారులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

మహాసభను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న సంఘు నాయకులు

పాలకుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జనగామలో 30న జరిగే గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నకీర్త యాకయ్య, జిల్లా కార్యదర్శి సాదం రమేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆ సంఘం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం గొర్రెలు, మేకలు పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జిట్టబోయిన రమేష్, కొంగరి ఐలయ్య, బెల్లి యుగందర్ ఉన్నారు.

గుడిసెవాసులకు ఇళ్లు ఇవ్వాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజేందర్

బచ్చన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోపాల్‌నగర్ శివారులోని మల్లు స్వరాజ్యం కాలనీలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని, కాలనీలో సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ డిమాండ్ చేశారు. పర్వతం నర్సింహులుతో కలిసి శనివారం కాలనీ వాసులతో మాట్లాడారు. కాలనీ ఏర్పడి మూడేళ్లవుతున్నా అధికారులు సౌకర్యాలు కల్పించడం లేదని మండిపడ్డారు. మండల అధికారులు అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, తాగునీటి సరపరా కోసం పైప్‌లైన్‌లు వేయాలన్నారు. రాత్రి వేళల్లో పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయన్నారు.

విద్యుత్ డిజిటల్ సేవల విస్తరణ

(5వ పేజీ తరువాయి)

అంశాన్ని సెల్‌ఫోన్‌కు మెసెజ్ రూపంలో సందేశం ఇవ్వడం జరుగుతుందని దాని ప్రకారం సంబంధిత పత్రాలు జతచేస్తే సరిపోతుందన్నారు. వినియోగదారుడు తన అప్లికేషన్ స్థితిని తెలుసుకోవడానికి కొత్తగా ట్రాకింగ్ చేసే వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. వినియోగదారులు వాట్సాప్ చాట్ బాట్ లో సైతం సమస్యలను తెలపవచ్చన్నారు. వినియోగదారులు తమ మొబైల్ నుంచి 7901628348కు హాయ్ అని చాట్ చేయగానే స్వాగతం అని వచ్చి రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది అందులో సర్వీస్ యూనిక్ నెంబర్ టైప్ చేసి సమస్యలు తెలపవచ్చన్నారు. విద్యుత్ బిల్లులను సైతం టీజీఎస్పీడీసీఎల్ యాప్‌తో పాటు టీ వ్యాలెట్, గూగుల్ పే, ఫోన్ పే, పేటీయం వంటి తదితర డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల ద్వారా చెల్లించే సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. ఈ వెబ్‌సైట్ ద్వారా సైతం అనేక రకాల సేవలను అందించడం జరుగుతుందన్నారు. ఎటువంటి విద్యుత్ సమస్యల తలెత్తిన 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

హమాలీ యూనియన్ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

జనగామ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హమాలీ సంఘం జిల్లా నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ద్వితీయ మహాసభను సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బైరాగోని బాలరాజ్, కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా చిట్యాల సోమన్న, ఉపాధ్యాక్షులుగా అపరధపు రాజు, భామండ్లపల్లి పెంటయ్య, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27న జనగామలో నిర్వహించే హమాలీ సంఘం రాష్ట్ర మహాభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

18న కంటి శస్త్ర చికిత్స శిబిరం

పాలకుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత శ్రేణి ఆస్పత్రిలో ఈనెల 18న ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి ఏతఈ సిద్దార్థరెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని కంటి సమస్యలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం బాధ్యులు

పాలకుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గాయాల సతీష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి మండల పేయింటర్ల సంఘం శనివారం రూ.10వేలు ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు గాదెపాక భాస్కర్, మండల అధ్యక్షుడు ఇరుగు అశోక్, గ్యార సురేష్, ప్రశాంత్, మల్లేష్, తూటి పర్శరాములు, కుమార్, వంగాల అశోక్, యాటాల మహేష్ ఉన్నారు.

నేడు ధర్మసాగర్‌కు మంత్రి వాకిటి శ్రీహరి రాక

ధర్మసాగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మసాగర్ మండల కేంద్రానికి ఆదివారం పశుసంవర్థక, పాడి పరిశ్రమ, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి రానున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య విచ్చేయనున్నారు. ఉదయం ముగ్గురు కలిసి ధర్మసాగర్ రిజర్వాయర్‌లో చేపపిల్లలను విడుదల చేస్తారు. అనంతరం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో క్రీడా పాఠశాలను ప్రారంభిస్తారు.

టీఎంకేఎంకేఎస్ మహాసభలను జయప్రదం చేయాలి

జనగామ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మత్స్యకారులు మత్స్యకార్మిక సంఘం(టీఎంకేఎంఎస్) మహాసభలను జయప్రదం చేయాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి మునిగెల రమేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రమేశ్ మాట్లాడారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పథకం నిరుపయోగంగా మారుతుందన్నారు. ప్రభుత్వం చేప పిల్లలకు బదులు సొసైటీలకు నగదు జమ చేయాలన్నారు. ఈనెల 25న కరీంనగర్‌లో నిర్వహించే టీఎంకేఎంకేఎస్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వడపల్లి రాజు, దుసరి నాగరాజు, నాయిని రామస్వామి, దండు కుమార్, కాట కృష్ణ, పిట్టల శంకర్, మెరుగు వెంకటేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్



పశువుల రక్త నమూనాలను సేకరిస్తున్న సుధాకర్

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్త

చిలుపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రయోగశాల డాక్టర్ సుధాకర్ సూచించారు. శనివారం. రాజవరంలో ఇటీవల గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసిన పశువుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. సుధాకర్ మాట్లాడుతూ సీజనల్‌గా సంక్రమించే వ్యాధులతో గొల్లకురుమలు, పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని, రోగాలు సోకినట్లు గుర్తించిన మరుక్షణమే సమీపంలో ఉన్న పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనేశ్, సిబ్బంది సుధాకర్, ఫయాజ్, మోయిన్‌పాషా, సదానందం, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలను పరిష్కరించాలి

జనగామ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 3వ వార్డులో శనివారం సీపీఎం శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయిన మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకపోతే మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కల్యాణం లింగం, పగిడిపల్లి బాలమణి, బొంతుగుల కవిత, దూసరి అందాలు, జంగా ఉప్పలయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం



మాట్లాడుతున్న సుమ

జనగామ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దాసగాని సుమ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమ మాట్లాడుతూ దేశంలో మహిళలపై రోజు రోజుకూ దాడులు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమావేశంలో బొమ్మిశెట్టి ఆర్య, గొడుగు రమేశ్, మానస, స్పందన, కావ్య, మమత, చందన తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో నిర్లక్ష్యం

- కార్మికులకు రక్షణ కరువు
- అజాగ్రత్తల నడుమ అభివృద్ధి పనులు



రక్షణ పరికరాలు లేకుండానే పనులు చేస్తున్న కార్మికులు

తాడ్వాయి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క- సారలమ్మల దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు జాగ్రత్తలు పాటించడం లేదని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. వందల సంవత్సరాలు నిలిచేలా కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న బేస్‌మెంట్, రాతి నిర్మాణాల పనులు చేపడుతున్న వందలాది మంది కార్మికులకు రక్షణ కరువైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికులకు చేతి తొడుగులు (గ్లౌస్), కళ్లద్దాలు, బూట్లు, హెల్మెట్లు, రక్షిత దుస్తులు, మాస్కులు ఇవ్వకుండానే అధికారులు, కాంట్రాక్టర్లు పనులు చేయిస్తున్నారని మండిపడుతున్నారు. అలాగే పని ప్రదేశంలో అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండటం లేదు. ఇంత జరుగుతున్నా కార్మిక శాఖ అధికారులు అటువైపు తొంగి చూసిన దాఖలాలు లేవు.

ఆరోగ్య ఉసిరి



(5వ పేజీ తరువాయి)

ఉంటాయి. ఉసిరి కాయలోని గొప్పతనం తెలిసిన మన పూర్వీకులు వీటిని బాగా ఉపయో గించుకుని ఆరోగ్యా న్ని పొందేవారు. మానవ దేహానికి శక్తినిచ్చే లేహ్యాల తయారీలో ఉసిరిని ఖచ్చితంగా అధిక మోతాదులో మిశ్రమం చేస్తారు. ఉసిరి గొప్పదనాన్ని పూర్వీకులు ఏనాడో గమనించి అనేక రకాల జ్వరాలకు ఉసిరిని దివ్య ఔషధంగా వినియోగించేవారు.

చైనా మలేషియా, జపాన్ దేశాల్లో ఉసిరిని ఎక్కువగా వినియోగిస్తారు. అక్కడ ఉసిరి చెట్లు ఎక్కువగా అందుబాటులో ఉంటాయి. సాధారణంగా ప్రకృతి నుంచి లభించే ఏ రకమైన పండుగానీ, కాయ గానీ తిన్న తర్వాత నీల్లు తాగితే నీరు తాగిన అనుభూతి తప్ప మరేమి ఉండదు. కానీ ఉసిరికాయ తిన్న తర్వాత నీళ్ల తాగితే మాత్రం చల్లగా తియ్యగా ఉండటం ప్రత్యేకత. ఉసిరి చెట్టు చల్లని నీడను ఇస్తుంది. మన పూర్వీకులు ఉసిరి చెట్టును మహత్యంగల వృక్షంగా భావించి పూజలు చేసేవారు. ఇప్పటికీ కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకు పూజలు చేయడంతో పాటుగా వ్రతాలు చేస్తుంటారు. శివాలయంలో ఉసిరికాయలలో దీపాలను వెలిగిస్తారు.

ఔషధాల ఉసిరి..

ఉసిరిలో విటమిన్-సి ఉంటుంది. ఉసిరి ద్రావణం బలవర్ధకమైన టానిక్‌లా పనిచేస్తుంది. ఉదయం ఉసిరి రసంలో ఒక చెంచా తేనె కలుపుకుని తీసుకుంటే అమృత పానీయంలోని సుగుణాలు లభిస్తాయని ప్రతీతి. ఉసిరి రసంలో పటిక బెల్లం కలిపి సేవిస్తే కాలేయంలో ఏర్పడే ఉబ్బర సమస్య, నొప్పి తగ్గుతాయని ఆయుర్వేద నిపుణులు తెలుపుతున్నారు. ఉసిరి రసం నేత్ర సంబంధ వ్యాధులను నివారిస్తుంది. ఉసిరి కాయలను ఉప్పులో వేసి ఊరగాయగా చేసుకున్నా, నీటిలో వేసి ఉడికించినా, ఎండిన కాయలను దంచి పొడిగా చేసినా ఎండబెట్టిన కాయలను దీర్ఘకాలంగా నిల్వ చేసుకున్నా అందులోని విటమిన్లు ఏమాత్రం నశించవు. నిత్యం ఉసిరికాయలను తీసుకుంటే దేహానికి బలం చేకూరుతుంది. నీటిలో ఊరబెడితే నీటిలో ఉప్పునీటిగుణం, వగరు గుణం పోయి ఆ నీరు మంచినీరుగా మారుతుంది. దాహంగా ఉన్నప్పుడు ఉసిరికాయలను నోట్లో వేసుకుంటే దాహం తీరినట్లు అవుతుంది. షుగర్ పేషెంట్లు ప్రతీ రోజు ఉసిరి రసం తీసుకుంటే ఇన్సులిన్ ఇంజక్షన్ అవసరం తగ్గుతుందని ఆయుర్వేద వైద్యులు సూచిస్తున్నారు. ఇంతటి మహత్తర గుణాలు గల ఉసిరికి కార్తీక మాసంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఉసిరిక స్నానాలు చేయడం హిందువుల ఆచారంగా కొనసాగుతుంది.